క్లుప్తంగా

జగనన్న ఆణిముత్యాలు ప్రోత్సాహం అందజేత



నగదును అందిస్తున్న శ్రీనివాసరావు

కొండాపురం: మండలంలోని సాయిపేట దామా చినబాబు మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు శనివారం పాఠశాల ప్రాంగణంలో విద్యా కమిటీ చైర్మన్ కలుజుల పాటి శ్రీనివాసరావు నగదు ప్రోత్సాహం అందించారు. 553 మార్కులతో మొదటి స్థానంలో నిలిచిన పులి మణిదీప్‌కు రూ. 3 వేలు, 524 మార్కులతో రెండో స్థానంలో నిలిచిన కావ్యకు రూ.2 వేలు, 513 మార్కులతో మూడో స్థానంలో నిలిచిన విష్ణువర్ధన్‌కు రూ.1,000 అందజేశారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల తనిఖీ



నిల్వలు తనిఖీ చేస్తున్న ఏడీ శ్రీనివాసులు

ఉదయగిరి: పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను నెల్లూరు వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసులు సోమవారం తనిఖీ చేశారు. దుకాణాల రికార్డులు పరిశీలించారు. గోదాముల్లోని స్టాక్‌ను తనిఖీ చేసి నమోదు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ దుకాణదారులు రైతులు ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన వెంటనే బిల్లులు అందజేయాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఏడీఏ చెన్నారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నిర్దిష్ట ధరలకే ఎరువుల విక్రయించాలి

దుత్తలూరు: ప్రభుత్వం నిర్దేశించిన ధరలకనుగుణంగా ఎరువులు విక్రయించాలని నెల్లూరు వ్యవసాయశాఖ ఏడీఏ ఎం.శ్రీనివాసులు తెలిపారు. శనివారం దుత్తలూరులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులు, బిల్ బుక్‌లు తనిఖీ చేశారు. ఆయన వెంట ఉదయగిరి ఇన్‌చార్జి ఏడీఏ పి.చెన్నారెడ్డి, ఏఓ ఎస్.వెంకటసుబ్బారెడ్డి, మర్రిపాడు ఏఓ రామ్మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ఆత్మకూరురూరల్: మండలంలోని వాశిలి న్యూనార్త్ ఎస్సీ పాఠశాలలో శనివారం ఆత్మకూరు అభయాంజనేయస్వామి దేవాలయం ధర్మకర్త ఏటూరు సుధాకర్‌రెడ్డి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు భవిష్యత్‌లో అవసరమయ్యే ఉపకరణాలు అందజేయడానికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. స్థానిక సర్పంచ్ చెలిక రమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

కావలి: కావలి సబ్ జైలులో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఆర్ వరలక్ష్మి జైల్లో ఉన్న ఖైదీలకు కొన్ని చట్టాలపై అవగాహన కల్పించారు. సమాజంలో చెడు ప్రభావాలను విడిచి మంచిగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఐ సాయిప్రసాద్, లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి, జైలు సూపరింటెండెంట్ చిన సుబ్బయ్య పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

దుత్తలూరు: ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా అడిషనల్ పీడీ నిర్మలాదేవి హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని 17 పంచాయతీల్లో చేసిన పనుల్లో మొత్తం రూ.19,516 రికవరీకి ఆదేశించామన్నారు. కొన్ని పనులకు సంబంధించి తిరిగి తనిఖీలు చేయాలని ఏపీడీ, ఇతర అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఏపీడీ గాయత్రి, ఎంపీడీఓ సాయిప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పసుపు రైతులకు బీమా అందించండి



మాజీ ఎంపీ మేకపాటికి విన్నవిస్తున్న రైతు సంఘ నాయకుడు కాకు వెంకటయ్య

ఉదయగిరి: పసుపు పంట సాగు చేసిన రైతులకు బీమా నగదు అందేలా చూడాలని ఏపీ రైతుసంఘం నాయకుడు కాకు వెంకటయ్య సోమవారం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఆయన మాట్లాడుతూ ఉదయగిరి ప్రాంతంలో 250 మంది రైతులు పసుపు పంట సాగు చేశారన్నారు. గతేడాది వీరికి రూ.32 వేలు వంతున బీమా నగదు జమచేశారన్నారు. ఈ ఏడాది ఇంతవరకు బీమా నగదు చెల్లించలేదని, ప్రభుత్వంతో మాట్లాడి బీమా నగదు అందేలా చూడాలని ఆయనకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో పలువురు పసుపు రైతులు పాల్గొన్నారు.

నూతన ప్రభుత్వాస్పత్రి భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

- ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి పరిసరాల్లో పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని సువిశాలమైన ప్రాంగణంలో అన్నీ వసతులతో కావలిలో అత్యాధునిక ప్రభుత్వ వైద్యశాలను నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. శనివారం కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించి 70 ఏళ్లు అవుతుందన్నారు. అప్పటి జనాభాను దృష్టిలో పెట్టుకుని 1.25 ఎకరాల విస్తీర్ణంలో ఆస్పత్రిని నిర్మించారన్నారు. కావలితో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో జనాభా భారీగా పెరిగారని, రాబోయే 30 ఏళ్లలో జనాభా పెరుగుదల ఇంకా భారీగా ఉంటుందన్నారు. ఇప్పటికే రోజుకు సుమారు 700 మంది పేదలు వైద్య సేవల కోసం కావలి ప్రభుత్వ ఆస్పతికి వస్తున్నారన్నారు. గర్భిణులు, కాన్పుల కోసం ఆస్పతికి రావడం పెరిగిందన్నారు. ఇరుకుగా ఉన్న ఈ ఆస్పత్రిలో అన్నీ వసతులు కల్పించడం సాధ్యం కాదని, ప్రజల రాకపోకలకు సులువుగా ఉండే విధంగా జాతీయ రహదారిని ఆనుకుని టోల్‌ప్లాజా వద్ద, సాయిబాబా గుడి వెనుక కాని 5 ఎకరాల భూమి సేకరించి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే కలెక్టర్‌కు తగిన సూచనలు ఇచ్చి చర్యలు తీసుకోవాలని చెప్పినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నిర్మిస్తున్న కొత్త భవనాలు త్వరలో పూర్తి అవుతాయని, వాటిలో రోగులకు సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని వైద్యులకు సూచించారు. కాన్పులు కోసం ప్రత్యేకంగా ఉన్న భవనం శిథిలావస్థకు చేరిందని, దానిని కూల్చేసి కొత్త భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యులు ఓపీ అయిన తర్వాత వార్డుల్లో ఉన్న ఇన్ పేషెంట్లను పరామర్శించి వైద్య పరంగ ఆసూచనలు ఇవ్వాలని ఎమ్మెల్యే చెప్పారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండకుండా మానవతా దృక్పథంతో విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి, మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ కారుమంచి సుబ్బారావు, వైద్యులు, నర్సులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ భరోసా



జాబ్‌మేళా ప్రారంభించిన మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- 19 కంపెనీలతో మూడో విడత జాబ్ మేళా
- 878 మంది హాజరు కాగా, 436 మంది ఎంపిక

ఆత్మకూరు: జాబ్‌మేళాతో నిరుద్యోగులకు ఉద్యోగ భరోసా కల్పిస్తున్నట్లు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఎమ్మెల్యే చొరవతో శనివారం పలు ప్రైవేట్ ప్రముఖ కంపెనీలను ఒక చోటకు చేర్చి భారీ జాబ్‌మేళా నిర్వహించారు. తొలుత నిరుద్యోగులకు నైపుణ్యం కల్పించేందుకు ఉద్దేశించిన స్కిల్ డెవలప్‌మెంట్, ప్రాక్టికల్స్, థియరీ ల్యాబ్‌లను ప్రారంభించారు. కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఏ రంగంలోనైనా ఉన్నత స్థాయికి చేరాలంటే నైపుణ్యం అవసరమని, తొలుత నైపుణ్యంపై అవగాహన కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యపై రూ.70 వేల కోట్లకుపైగా ఖర్చు చేసిందని ఆ ఫలితాలు కనిపిస్తున్నాయన్నారు. 90 శాతం వ్యవసాయం మీద ఆధారపడిన ఈ ప్రాంతంలో 40 శాతం ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఎంఎస్‌ఎంఈ పార్కులో ఆరు నెలల వ్యవధిలో పరిశ్రమను స్థాపించనున్నట్లు, మరో రెండు పరిశ్రమలు స్థాపించి 3 వేల మందికి నారంపేట ఇండస్ట్రియల్ పార్కులో ఉద్యోగావకాశాలు కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తానన్నారు. రానున్న ఐదేళ్లలో మంచి ప్రణాళికలతో స్కిల్ డెవలప్‌మెంట్‌లో సత్తా చాటుతూ మన ప్రాంతం నుంచి ఉద్యోగాలకు వెళ్లిన ప్రతి ఒక్కరూ. ఇంటర్వ్యూలో ఎంపికయ్యేలా సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా కావలికి చెందిన విశ్రాంత లెక్చరర్ అన్నదాత మణి (ప్రాస మణి) నిరుద్యోగం, ఎమ్మెల్యే పలు కంపెనీలను ఒక చోట చేర్చి జాబ్‌మేళా నిర్వహించడంలో చేస్తున్న కృషిపై ప్రాసరూపంలో ఆకట్టుకొనేలా చేసిన ప్రసంగానికి కరతాళధ్వనులు మారుమ్రోగాయి.

జాబ్ మేళాకు విశేష స్పందన

జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. మొత్తం 19 ప్రైవేట్ కంపెనీలు ఈ జాబ్ మేళాలో తమ ప్రతినిధులను హాజరు పరిచారు. 878 మంది అభ్యర్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పలు కంపెనీలు అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేసి 315 మందిని ఎంపిక చేసుకున్నట్లు వివరించారు. త్వరలో వారికి వ్యక్తిగత సమాచారం ఇచ్చి రిక్రూట్ చేసుకోనున్నట్లు తెలిపారు. 121 మందిని వెంటనే ఉద్యోగాల్లో చేరేందుకు పలు కంపెనీలు ఎంపిక చేసినట్లు వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు మొత్తం మీద 436 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.లక్ష్మి, హెచ్‌ఓడీ ఎస్పీ వెంకట రమణారెడ్డి, జిల్లా స్కిల్ హబ్ డెవలప్‌మెంట్ కేంద్రం నిర్వాహకుడు విజయ వినీల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ, కమిషనర్ బి నాగేశ్వరరావు, వైస్ చైర్మన్లు కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, ఎంపీపీలు కేతా వేణుగోపాల్ రెడ్డి, బోయిళ్ల పద్మజారెడ్డి, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, జేసీఎస్ కన్వీనర్ రాజేంద్రనాయుడు, కౌన్సిలర్ శివకోటారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా
మూడు చక్రాల మోటార్ వాహనం



దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ వాహనాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ వాహనాలను అందించిందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో ముగ్గురికి వాహనాలు మంజూరు కాగా శనివారం తన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్ సహకార సంస్థ (ఏపీడీఏఎస్‌సీఏసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారిలో, 70 శాతం పైగా వైకల్యం కలిగిన 18 నుంచి 45 ఏళ్ల లోపు వారు అర్హులుగా ఎంపిక చేశారు. కనీసం పదో తరగతి పాసవ్వాలి. రూ.3 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉండాలి. లబ్ధిదారుల ఎంపికకు రెండు నెలల ముందు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. వారికి సొంత వాహనం ఉండకూడదు. గతంలో ఇటువంటి వాహనాలు తీసుకుని ఉండకూడదు తదితర నిబంధనల మేరకు అర్హులను ఎంపిక చేశా రు. ఈ కార్యక్రమంలో దగదర్తి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు అనీల్‌రెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కేతిరెడ్డి జగదీశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని లేఅవుట్లు తొలగిస్తాం



అక్రమ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ మధు

కలిగిరి: మండలంలోని నాగసముద్రం పంచాయతీలో వేస్తున్న లేఅవుట్లకు ఎలాంటి అనుమతులు లేవని పంచాయతీ విస్తరణాధికారి వెలుగోటి మధు తెలిపారు. అక్రమంగా వేస్తున్న లేఅవుట్లను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ కావలి–ఉదయగిరి జాతీయ రహదారి నిర్మాణ పనుల జరుగుతున్న నేపథ్యంలో అనుమతులు లేకుండా విచ్చలవిడిగా లేఅవుట్లు వేస్తున్నారన్నారు. సర్వే నంబరు 102లో 5.22 ఎకరాల్లో కొత్తగా ప్లాట్లు వేస్తున్న వాటిని తొలగిస్తామని హెచ్చరించారు. లేఅవుట్ యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డీ శ్రీనివాసులు, పచాయతీ కార్యదర్శి ఎ. మల్లికార్జున పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

కొండాపురం: మండలంలోని వెలిగండ్ల పరిసర ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో కొండాపురం ఎస్సై షేక్ ఖాజావలి శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 2,530 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. సోమవారం వీరిని కోర్టుకు హాజరు పరుచనున్నట్లు తెలిపారు.

నాటు సారా విక్రేత అరెస్ట్

చేజర్ల: నాటు తయారు చేసి విక్రయిస్తున్న మాముడూరు గ్రామానికి చెందిన షేక్ చోటాసాహెబ్‌ను సెబ్ అధికారులు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 8 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. నాటు సారా తయారీకి ఇరువూరు కాలువ సమీపంలోని పొదల్లో సిద్ధంగా ఉంచిన 50 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నిందితుడిని ఆత్మకూరు కోర్టులో హాజరుపరిచారు. దాడుల్లో పొదలకూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ బి వెంకటరావు, ఎస్సై శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణలో నలుగురికి గాయాలు

చేజర్ల: ఇంటి గోడ విషయమైన జరిగిన ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం చేజర్ల మండలం ఎన్‌వీకండ్రిక పంచాయతీ గాలిపాళెంలో జరిగింది. ఈ ఘర్షణలో కావేటి అంజయ్య, ఆనందమ్మ, సునీత, సుబ్బరాయుడుకు గాయాలు కావడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చేజర్ల(సోమశిల): అనంతసాగరంలో సోదరుల మధ్య జరిగిన చిన్నపాటి ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఖాజా రహంతుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దూర ప్రాంత బస్సులు బస్టాండ్‌కు వచ్చేలా చూస్తా

- జగనన్న సురక్షపై అధికారులు, నాయకులతో సమావేశం
- ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



పార్టీ నాయకులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణ ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూరేలా ఆధునిక బస్టాండ్‌ను నిర్మించి కానుకగా ఇచ్చామని, ప్రజల కోరిక మేరకు దూరప్రాంత బస్సులు సైతం పట్టణంలోకి వచ్చేలా సంబంధిత మంత్రి, అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మున్సిపల్, ఆర్టీసీ అధికారులు, పలువురు పార్టీ నాయకులతో మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం ఆయన భేటీ అయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం అమలు చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యంగా వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది నిర్దేశించిన క్రమంలో ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను నమోదు చేసుకోవాలన్నారు. 1వ తేదీ ఆయా సచివాలయాల పరిధిలో అప్పటికే నమోదై ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులతో సమీక్షిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ పథకాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, కమిషనర్ బి నాగేశ్వరరావు, డీఎం కరీమున్నీసా, పార్టీ నాయకులు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, సొసైటీ అధ్యక్షుడు ఎస్ ప్రతాప్‌రెడ్డి, జమీర్, ఎస్ ప్రతాప్, రహీం, కలాం, పలువురు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



కావలి: జగనన్న సురక్ష కార్డు అందజేస్తున్న ఎంపీపీ ప్రసాద్‌నాయుడు, అధికారులు

- జగనన్న సురక్ష ప్రారభించిన ఎమ్మెల్యే

కావలి: అర్హులైన ఏ ఒక్కరూ లబ్ధి పొందకుండా మిగిలరాదన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'జగనన్న సురక్ష' ప్రారంభించారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో జగనన్న సురక్ష సర్వేను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణంలోని 30వ వార్డు సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, మున్సిపల్ అధికారులతో తొలుత సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని 85 గ్రామ, వార్డు సచివాలయాల్లో 'జగనన్న సురక్ష' కింద ప్రజలకు అవసరమైన కీలక పత్రాలను రాష్ట్ర ప్రభుత్వం సేవా రుసుం లేకుండా అందించనున్నట్లు చెప్పారు. ప్రతి గడపకు వలంటీర్లు చేరుకుని పథకాలు, అవసరాలు అడిగి తెలుసుకుంటారని చెప్పారు. నియోజకవర్గంలో ఉన్న 98,907 ఇళ్లలో ప్రతి ఇంటిని సందర్శిస్తారని చెప్పారు. అర్హులై ఉండి ఎక్కడైనా లబ్ధి అందని వారుంటే గుర్తించి సమస్య పరిష్కారానికి పత్రాలను సేకరిస్తాని తెలిపారు. వారికి అవసరమైన సర్టిఫికెట్లకు సంబంధించిన డాక్యుమెంట్లను తీసుకుని అవసరమైన దరఖాస్తులను పూరించి వారికి తోడుగా నిలుస్తారన్నారు. మున్సిపల్ కమిషనర్ ఈ కిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, జనిగర్ల మహేంద్రయాదవ్, కుందుర్తి శ్రీనివాసులు, కనుపర్తి రాజశేఖర్, పానుగోటి అనురాధ, నాగేశ్వరమ్మ, షాహుల్ హమీద్, అమరా వేదగిరి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రారంభం

దగదర్తి (కావలి): ప్రతి ఇంట్లోని ప్రభుత్వ సేవలకు సంబంధించి చిన్న సమస్యను కూడా ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించాలన్న చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని దగదర్తి మండలంలో ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు శనివారం ప్రారంభించారు. తహసీల్దార్ చెంచయ్య, ఎంపీడీఓ విజయకుమార్‌లతో కలిసి ఎంపీపీ దగదర్తిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి ప్రతి ఇంటిని సందర్శించారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): ప్రజలకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలను, ఇతర ప్రభుత్వ సేవలను సర్వే ద్వారా గుర్తించి ఉచితంగా అందజేయడమే జగనన్న సురక్ష ప్రధాన లక్ష్యమని పలువురు నాయకులు, అధికారులు పేర్కొన్నారు. మర్రిపాడు మండలం చుంచులూరులో శనివారం సచివాలయ కన్వీనర్ ఇందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరసింహనాయుడు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై ఇంటింటి సర్వే నిర్వహించారు. వీఆర్‌ఓ రమణయ్య, ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు కిషోర్, ప్రణవి, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు మదన్‌రాజు, కృష్ణంరాజు, కొండయ్య, రామరాజు, ప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా జగనన్న సురక్ష సర్వే – డీపీఓ

ఉదయగిరి: జగనన్న సురక్ష సర్వేను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా పంచాయతీ అధికారిణి (డీపీఓ) సుస్మితారెడ్డి తెలిపారు. ఆమె శనివారం ఉదయగిరి మండలం శకునాలపల్లిలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలందించారు. అనంతరం ఆమె జగనన్న లేఅవుట్లను, సచివాలయాన్ని పరిశీలించారు. పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది సచివాలయ సేవలను విస్తృత పరచాలన్నారు. ఉదయగిరి పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఆమె వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జునరావు, ఈఓ నరసయ్య, సర్పంచ్ పాములూరి సామ్రాజ్యం, పంచాయతీ కార్యదర్శులు కరిముల్లా పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించేలా చర్యలు

సంగం: అర్హులై ఉండి సంక్షేమ పథకాలు రాని లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేసి వారందరికీ సంక్షేమ పథకాలు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం ద్వారా చర్యలు తీసుకుంటుందని డీపీఓ సుస్మితారెడ్డి తెలిపారు. శనివారం సంగం సచివాలయాన్ని ఆమె సందర్శించారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. జగనన్న సురక్ష మొబైల్ యాప్‌పై వారికి అవగాహన కల్పించారు.

జగనన్న సురక్ష పరిశీలన

సంగం: సంగం సచివాలయం పరిధిలో శనివారం క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వేను ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి పరిశీలించారు. సర్వే తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పక్కా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు ఆశోక్, ఎంపీడీఓ గోపి, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉదయగిరి : సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ సుస్మితారెడ్డి



సంగం: జగనన్న సురక్ష పరిశీలిస్తున్న ఆర్డీఓ

జగనన్న సురక్షను పారదర్శకంగా నిర్వహించాలి

జలదంకి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి సచివాలయ పరిధిలో పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ సీహెచ్ పద్మావతి అన్నారు. శనివారం ఆమె కేశవరం, చోడవరం, గట్టుపల్లి సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

బాధ్యతగా జగనన్న సురక్ష నిర్వహించాలి

వరికుంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బాధ్యతగా నిర్వహించాలని ఎంపీడీఓ విజయభాస్కరరావు, తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. శనివారం మండలంలోని జి.కొండారెడ్డిపల్లిలో జగనన్న సురక్షపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్, వీఆర్వో శేషారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న సురక్ష సర్వే

అల్లూరు: మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. స్థానిక కత్తుల వారి వీధిలో కమిషనర్ ఫణికుమార్, స్థానిక నేత నీలం సాయికుమార్ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, జేసీఎస్ మండల కన్వీనర్ ఉస్మాన్ షరీఫ్, సచివాలయ కన్వీనర్లు బత్తుల సుధాకర్, షేక్ జంషీర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజలకు వరం

ఆత్మకూరురూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకం ప్రజలకు వరమని అప్పారావుపాళెం నోడల్ అధికారి వెంకాయమ్మ తెలిపారు. సచివాలయాల సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి అప్పారావుపాళెంలో శనివారం నిర్వహించిన ఇంటింటి సర్వేలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు హజరత్‌నాయుడు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి కార్యాచరణ

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్ రెడ్డి

ఆత్మకూరురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి కార్యాచరణ అమలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరటంపాడు సచివాలయం పరిధిలో శనివారం ఆరవీడు, జంగాలపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. తొలుత రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాన గ్రామంతో పాటు ఆరవేడులోని రెండు ఎస్సీ కాలనీలు, జంగాలపల్లిలో మరొక ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించి ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిన లబ్ధికి సంబంధించిన బ్రోచర్లను అందజేసి వివరించారు. ఎస్సీకాలనీల్లో తాగునీటి పైపులైన్లు, విద్యుత్ సమస్యలను స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తేగా ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆరవీడులో వైద్యుల శేషయ్య తనకు అర్హత ఉన్నా పింఛన్ రాలేదని ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో ఎమ్మెల్యే సొంత నిధులు అందజేశారు. వచ్చే నెల నుంచి బాధితుడికి పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మేకపాటి అభినవ్‌రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ మెంబరు గాజుల తాజుద్దీన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, స్థానిక సర్పంచ్ సూరం ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ ఏఈలు వెంకటేశ్వర్లు, నయోమి, సతీష్‌చంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు దనాల రమేష్ నాయుడు, పెమ్మసాని శ్రీనివాసులు నాయుడు, కొల్లి దొరస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మాలేపాటి అరెస్ట్

- మరో 35 మంది కూడా.., స్టేషన్ బెయిల్‌పై విడుదల



రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మాలేపాటి సుబ్బనాయుడు, టీడీపీ నాయకులు

కావలి: కావలి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల విధులను ఆటంకపరుస్తూ వారితో వాగ్వివాదానికి దిగారన్న ఆరోపణపై కావలి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడుతో పాటు మరో 35 మందిని శనివారం కావలి టూ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కావలిలోని తన నివాసంలో ఉన్న సుబ్బానాయుడును పోలీసులు టూ టౌన్ స్టేషన్‌కు తరలించే క్రమంలో టీడీపీ నాయకులు అక్కడికి చేరుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. సుబ్బానాయుడుతో పాటు మరో 40 మందిపై తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలలోకి వెళితే.. నియోజకవర్గంలో గ్రావెల్ దందా జరుగుతోందని ఆరోపిస్తూ తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ నాయకులు ధర్నా చేశారు. అలాగే వంటావార్పు పేరుతో అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారు. ఈ ఘటనపై తహసీల్దార్ మాధవరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి సుబ్బానాయుడితో పాటు 35 మందిని అరెస్ట్ చేశారు. తర్వాత వీరిని స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని పొంగూరు మాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అమ్మ వారికి పసుపు, కుంకుమలతో సారె మహోత్సవం నిర్వహించారు. పొంగూరు గ్రామానికి చెందిన చల్లా వెంకటేశ్వర్లురెడ్డి, రత్నమ్మ దంపతుల ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. పండరీ భజనలు, పౌరాణిక ఏకపాత్రాభినయాలు, మ్యాజిక్ షోలు, అనంతరం అన్నదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆలయ పూజారి పాశర్లపూడి వెంకటేశ్వర్లు, విశేష పూజలు, అభిషేకాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.